సాక్షి అనంతపురం

గురువారం । 13 । ఏప్రిల్ । 2023



డిగ్రీ సప్లి ఫలితాల విడుదల

ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ నాల్గో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో ఉంచారు.



1100 రైల్వే ఉద్యోగాల భర్తీ!

గుంతకల్లు డివిజన్‌లో 1100 రైల్వే ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. ఈ మేరకు నియామక పత్రాలు సిద్ధమయ్యాయి. 8లో

గరిష్టం/కనిష్టం

42.6°/17.5°

జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. భానుడి భగభగలు కొనసాగుతున్నాయి.



గురువారం ఇఫ్తార్ 6.35 | శుక్రవారం సెహరి 4.48

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సమన్వయంతో పనిచేయండి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు



జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర మంత్రి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ గ్రాండ్‌లో బుధవారం చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలుచేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. 27 నియోజకవర్గాల్లో 'గడపగడపకూ మన ప్రభుత్వం', 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంపై సమీక్షించారు. రోజుకు రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు పార్టీ నాయకులకు తెలిపారు. అందరినీ సమన్వయపరచి అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని నాయకులకు సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించబోం



ఆర్డీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కళ్యాణదుర్గం: ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ఎం.గౌతమి హెచ్చరించారు. బుధవారం కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం, గోళ్ల సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి.. ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వీడాలన్నారు. ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలందించాలని సూచించారు. సచివాలయ, రెవెన్యూ తదితర సేవలను నిర్దేశిత గడువులోపు అందించాలన్నారు. పెండింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఎస్సీల భూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురుమూర్తి, రామన్న, బాబు, మారెన్న, వెట్టి తిప్పేస్వామి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, డీఎల్‌డీఓ శంకర్, ఎంపీడీఓ బాలాజీ పాల్గొన్నారు.

టమాట కిలో రూ.8

అనంతపురం అగ్రికల్చర్: కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ఠ ధర రూ.8 పలికింది. మార్కెట్‌కు 25 టన్నుల చీనీకాయలు అమ్మకానికి రాగా గరిష్ఠ ధర రూ.8, కనిష్ఠం రూ.3, సరాసరి రూ.4.50 ప్రకారం అమ్మకాలు జరిగాయని ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

భూగర్భం.. ఖ'నిజం'

- 'అనంత'లో అరుదైన మూలకాల గుర్తింపు
- సెల్ ఫోన్, టీవీలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకం
- స్క్రీన్ డిస్‌ప్లే, సెమీ కండక్టర్ పరిశ్రమలో విరివిగా వినియోగం



ఏపీ నెట్‌వర్క్ :

జిల్లా భూగర్భంలో అరుదైన మూలకాలున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించటం కొత్త పరిశోధనలకు తెర తీసింది. హైదరాబాద్‌లోని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ)కి చెందిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ పి.వి.సుందరరాజు బృందం జిల్లాలో కీలక పరిశోధన చేసింది. వీరి పరిశోధనలో అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పెద్ద ఎత్తున అరుదైన మూలకాల (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. అనంతపురం జిల్లాలోని దంచర్ల, దండువారిపల్లి, పెద్దవడుగూరు, రెడ్డిపల్లి, చింతలచెరువు, చిత్తూరు జిల్లాలోని పులికొండ ప్రాంతాల్లో వీటి నిల్వలు ఉన్నట్లు నిర్ధారించారు. భూగర్భంలో అరుదుగా దొరికే ఈ మూలకాలకు ప్రకాశించే తత్వంతో పాటు రసాయనిక చర్యలను వేగవంతం (కేటలిస్ట్) చేసే గుణాలు ఉంటాయి. వీటితో తయారీ రంగంలో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. గాలి మరలు (టర్బయిన్లు), సోలార్ ప్యానల్స్, సెల్‌ఫోన్లు, సెమీ కండక్టర్లు, ఏవియేషన్, ఆటోమొబైల్, స్పేస్ టెక్నాలజీ, మెడికల్ టెక్నాలజీ, శాశ్వత అయస్కాంతాల తయారీ... ఇలా వివిధ వస్తువుల తయారీకి ఉపయోగిస్తున్నారు. మన దేశంలో బీచ్ శాండ్ (సముద్ర తీరంలోని ఇసుక) నుంచి వీటిని వేరు చేసి వాడుతున్నారు. తాజాగా భూమిలోనూ వాటి నిల్వలు ఉన్నట్లు పరిశోధనల్లో గుర్తించారు. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని రాళ్లలో అల్లనైట్, సెరియేట్, థోరేట్, కొలంబైట్, ట్యాంటలైట్, అపటైట్, జిర్కాన్, మోనజైట్, ఫ్లోరైట్ వంటి 15 రకాల మూలకాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. అరుదైన మూలకాలకు ప్రత్యామ్నాయాలను గుర్తించేందుకు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) సుందరరాజు బృందానికి ప్రాజెక్టు అప్పగించింది. ఆరేళ్లపాటు పరిశోధనలు చేసిన ఈ బృందం అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో మూలకాల లభ్యత ఉన్నట్లు గుర్తించి సీఎస్ఐఆర్‌కు నివేదికను అందించింది. ఈ మేరకు ఈ రెండు జిల్లాల్లో పెద్ద ఎత్తున నిల్వలు ఉన్నట్లుగా పేర్కొన్నారు. దంచర్ల ప్రాంతంలో దాదాపు 18 చదరపు కిలోమీటర్ల పరిధిలో సెనైట్ రాక్ గనులు ఉన్నాయి. ఈ రాళ్లలోనే అరుదైన మూలకాలు ఉన్నట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో ఎంత విస్తీర్ణంలో, ఎంత లోతుకు ఉన్నాయనే విషయంపై మరింత అధ్యయనం చేయాల్సి ఉంది.

ఉత్పత్తిలో చైనా టాప్..

చైనాలోని మట్టిలోనే అరుదైన మూలకాలు లభిస్తుండటం ఆ దేశానికి కలిసి వచ్చింది. వాటిని వెలికితీయటం సులువు కావటంతో పాటు తక్కువ వ్యయంతోనే సాధ్యమవుతోంది. ప్రపంచంలోనే అత్యధికంగా చైనాలో 4.4 కోట్ల టన్నులు, వియత్నాంలో 2.2 కోట్ల టన్నులు, ఇండియాలో 69 లక్షల టన్నుల నిల్వలు ఉన్నట్లు ఇప్పటివరకు గుర్తించారు. 2020 సంవత్సరంలో చైనా 1.40 లక్షల టన్నుల మూలకాలను ఉత్పత్తి చేసింది.

- ఉత్పత్తి పరంగా చైనా, అమెరికా, మయన్మార్, ఆస్ట్రేలియా, మడగాస్కర్ తర్వాత ఆరో స్థానంలో ఇండియా ఉంది. ప్రపంచంలోని ఎన్నో దేశాలకు చైనా నుంచే ఈ మూలకాలు ఎగుమతి అవుతున్నాయి. ఇండియా సహా అనేక దేశాలు చైనాపైనే ఆధార పడుతున్నాయి. చైనా నుంచి దిగుమతులు క్రమంగా తగ్గించుకుంటూ మన దేశంలోనే అరుదైన మూలకాలను వెలికితీయాలని శాస్త్రవేత్తలు, పరిశ్రమల నిర్వాహకులు భావిస్తున్నారు.

ఎన్జీఆర్ఐకి లేఖ రాశాం



తాడిపత్రి నియోజకవర్గంలో ఎన్జీఆర్ఐ పరిశోధనలు చేసిందని తెలిసింది. మాకు ఆ సంస్థ నుంచి సమాచారం లేదు. మేము విచారించగా.. ఇది ప్రాథమిక పరిశోధనలు మాత్రమే అని చెప్పారు. పూర్తిస్థాయిలో పరిశోధనలు జరిగాక రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నట్లు తెలిసింది. దీనిపై మేము కూడా ఎన్జీఆర్ఐకి లేఖ రాశాం.

–నాగయ్య, డిప్యూటీ డైరెక్టర్, మైనింగ్ విభాగం, అనంతపురం

ప్రతి విద్యార్థికీ 'కానుక'



అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర అబ్జర్వర్ మహేశ్వరరెడ్డి

ఆత్మకూరు: ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుకను అందేలా చొరవ తీసుకోవాలని ఎమ్మార్సీ సిబ్బందికి జగనన్న విద్యాకానుక (జేవీకే) రాష్ట్ర అబ్జర్వర్ మహేశ్వరరెడ్డి సూచించారు. విద్యాకానుక కిట్లు ఈ నెల 15 నాటికి అన్ని మండల కేంద్రాలకు చేరుతాయన్నారు. బుధవారం ఆత్మకూరు ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించి, నాడు-నేడు కింద పూర్తి చేసిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బందితో సమావేశమై జగనన్న విద్యాకానుక పంపిణీపై అవగాహన కల్పించారు. యూనిఫాంను అందరూ ఒకే రకంగా కుట్టించుకునేలా ఓ కరపత్రాన్ని సిద్ధం చేసివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ తిప్పేస్వామి, అలెస్కో రవినాయక్, ఎంఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

కంబదూరు: స్థానిక కేజీబీవీలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక స్టాక్‌పాయింట్‌ను రాష్ట్ర పరిశీలకుడు మహేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుక కిట్‌లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఎంఓ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

కిట్లు సద్వినియోగమవ్వాలి

శెట్టూరు: జగనన్న విద్యాకానుక కిట్‌లను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునేలా చొరవ తీసుకోవాలని ఎమ్మార్సీ సిబ్బందికి జేవీకే రాష్ట్ర పరిశీలకుడు మహేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక జేవీకే కిట్లను నిల్వ చేసే స్టాక్‌పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఎంఈఓ శ్రీధర్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాతికేళ్లకు మాస్టార్లుగా మురిశారు





కౌన్సెలింగ్‌కు హాజరైన 98 - డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు, సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 98-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు

- తొలిరోజు 98-డీఎస్సీ అభ్యర్థుల కౌన్సెలింగ్ ప్రశాంతం
- 280 మందిలో 251 మంది హాజరు
- 29 మంది అభ్యర్థుల గైర్హాజరు
- వంద మందికి నియామక ఉత్తర్వులు
- నేడు 281 నుంచి 536 నంబరు వరకు కౌన్సెలింగ్

రాప్తాడు రూరల్: పాతికేళ్ల తర్వాత ఉద్యోగం సాధించిన అభ్యర్థుల్లో సంతోషం వెల్లివిరిసింది. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నెరవేర్చడంతో వారిలో ఉత్సాహం ఉరకలెత్తింది. తమ కల సాకారమైనందుకు ఆనందంలో ఉబ్బితబ్బిబ్బయ్యారు. నియామక ఉత్తర్వులు అందుకుని మురిసిపోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ - 98లో అర్హత సాధించిన అభ్యర్థులు 536 మంది ఉన్నారు. అనంతపురం శారదానగర్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలిరోజు బుధవారం 1 నుంచి 280వ నంబరు వరకు కౌన్సెలింగ్‌కు పిలవగా.. 251 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల 29 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమైన కౌన్సెలింగ్ సాయంత్రం 6.30 గంటల వరకు సాగింది. డీఈఓ ఎం.సాయిరామ్ దగ్గరుండి పర్యవేక్షించారు. కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలియజేశారు. కౌన్సెలింగ్ పూర్తయిన వారిలో 100 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. తక్కిన వారికి గురువారం అందజేయనున్నారు. కాగా.. రెండో రోజు గురువారం ఉదయం పది గంటలకు 281 నుంచి చివరి 536 నంబరు వరకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందని డీఈఓ తెలిపారు.

మీ కలలను సాకారం చేసిన ప్రభుత్వం

కౌన్సెలింగ్‌లో ముందుగా డీఈఓ సాయిరామ్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 98-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల కలలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. కేటగిరీ-3, 4 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోస్టులు మంజూరై టీచర్లు లేని పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి టీచర్లు తక్కువగా ఉన్న పాఠశాలలను తొలి ప్రాధాన్యతగా తీసుకున్నామన్నారు. ఇన్నేళ్ల తర్వాత విద్యా కుటుంబంలో చేరుతుండడం సంతోషమన్నారు. ఈ టీచర్లందరికీ ముందుగా శిక్షణ కూడా ఇప్పిస్తామన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి, అనంతపురం, గుత్తి డిప్యూటీ డీఈఓలు పద్మవాణి, శంకరప్రసాద్, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, ఏఎస్ఓ ఓబుళరెడ్డి, ఏపీఓ నాగరాజు, సమగ్రశిక్ష ఏఎస్ఓ గురుమునికృష్ణ, ఏపీఓ నారాయణస్వామి, ఐటీ సెల్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

మా దేవుడు జగన్

'దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న సమస్యను పరిష్కరించి మా జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా పాలిట దేవుడు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం' అని 98-డీఎస్సీ అభ్యర్థులు ఉద్వేగభరితంగా సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో 98-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. తమకు న్యాయం చేయాలని 25 ఏళ్లు పోరాటం చేసినా ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. పూర్తిగా ఆశలు వదులుకున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఆయన చేసిన సాయం ఎన్నటికీ మరచిపోలేమన్నారు. ముఖ్యమంత్రికి, తమ తరఫున కృషి చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలత, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు కేశవరపు జాలిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నేత కాకర్ల వెంకటరామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్సీ-98 పోరాట సమితి నాయకులు చల్లా రామాంజనేయులు, కిశోర్ బాబు, శివప్రసాద్, మంజునాథ్, రేవన్న, ఉత్తప్ప, వెంకట్రావు, కె.రెడ్డప్పరెడ్డి, ఎస్.హుసేన్‌వలి, ఈ.శ్రీధర్‌రావు, ఎస్.జిలాన్‌బాషా, ఎ.వెంకటేష్, ఎస్.జాకీర్ హుసేన్, వైఎస్సార్‌టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గోవిందరెడ్డి, నాయకులు రమణ, ఓబిరెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- పగలు తీవ్రమైన ఎండలతో సెగలు
- అనూహ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుదల
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన వేసవితాపం
- ఉక్కపోత, వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తప్పనిసరి



అనంతపురంలో ఎండలో గొడుగుతో వెళ్తున్న యువతులు

అనంతపురం అగ్రికల్చర్: భానుడు భగభగమంటున్నాడు. పగటి పూట తీవ్రమైన ఎండలతో సెగలు కక్కిస్తున్నాడు. అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు కాస్తంత చల్లటి వాతావరణం ఏర్పడటం కొంతలో కొంత ఉపశమనం. అనూహ్యంగా రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా పగటిపూట వేసవితాపం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లిలో 43.3 డిగ్రీలు, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 42.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం విశేషం. గత 15 రోజులుగా పగలు 37 నుంచి 41 డిగ్రీలు, రాత్రిళ్లు 19 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. అయితే గత రెండు రోజులగా పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం 16 నుంచి 21 డిగ్రీల మధ్య నమోదు కావడం విశేషం. దీంతో జిల్లా వ్యాప్తంగా వాతావరణం మారింది. బుధవారం యల్లనూరు, బొమ్మనహాళ్, గుంతకల్లు, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, పెద్దవడుగూరు, గుత్తి, కూడేరు, శింగనమల, యాడికి, శెట్టూరు, పుట్లూరు, అనంతపురం, విడపనకల్లు, కంబదూరు, నార్పల, ఆత్మకూరు, అలాగే తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం, పరిగి, రామగిరి, కనగానపల్లి, ఎన్పీ కుంట, పెనుకొండ, కొత్తచెరువు, పుట్టపర్తి, తలుపుల మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మిగతా మండలాల్లో 38 నుంచి 40 డిగ్రీల మధ్య కొనసాగాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

ఈ నెల చివరి వారం లేదా మే నెలలో గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భానుడి ప్రతాపానికి బెంబేలెత్తే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఉదయం పదింటికే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, తాటి ముంజలు, ఓఆర్ఎస్, ఇతరత్రా పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రాకూడదని చెబుతున్నారు. వదులుగా ఉండే వస్త్రాలు ధరించడం, ఉప్పు, నీరు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం 7 నుంచి 8 లీటర్ల నీళ్లు తీసుకుంటే వడదెబ్బబారి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, రోగగ్రస్తులు మరింత జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

ప్రజల్లో నమ్మకం పెరిగేలా పోలీసు సేవలు

- నూతన ఎస్పీ కంచి శ్రీనివాసరావు



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవలందిస్తామని నూతన ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నూతన ఎస్పీకి ఉన్నతాధికారులు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. గౌరవవందనం స్వీకరించిన అనంతరం కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అదనపు ఎస్పీ నాగేంద్రుడు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, పోలీసు అడహాక్ కమిటీ సభ్యులు త్రిలోక్, ఇందిర, సుధాకరరెడ్డి, పాల్, హరి, వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాన్ఫరెన్స్‌హాలులో ఎస్పీ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోనే మంచి గుర్తింపు కలిగిన జిల్లా అనంతపురమని, ఎస్పీగా మొదటిసారి తాను ఇక్కడ బాధ్యతలు స్వీకరిస్తున్నానని చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పాటు పడతామన్నారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా తమ సేవలుంటాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడబోమన్నారు. ప్రజల సహకారంతో అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తామన్నారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే తమ ధ్యేయమని అన్నారు. ప్రజలు పోలీసుల సేవలను నిర్భయంగా పొందవచ్చన్నారు.

పటిష్ట బందోబస్తు నిర్వహిస్తాం

నార్పల: జగనన్న వసతి దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు జమ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 17న నార్పలకు వస్తున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన నార్పలలో సీఎం సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ అస్రార్‌బాషా, ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించాలని నూతన ఎస్పీ కంచి శ్రీనివాసరావు డీఎస్పీ వీఎన్‌కే చైతన్యను ఆదేశించారు. బుధవారం రాత్రి మొదటిసారిగా తాడిపత్రి డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఫ్యాక్షనిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అగ్రవర్ణ పేద మహిళలకు 'ఈబీసీ నేస్తం'
- పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు
- జిల్లాలో 21,539 మందికి రూ.32.31 కోట్ల లబ్ధి



ఈబీసీ నేస్తం మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, మేయర్ వసీం, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న తదితరులు

అనంతపురం అర్బన్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేద మహిళలకు 'ఈబీసీ నేస్తం' పథకం రెండో విడత నగదు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కాగజ్‌గర్ రిజ్వాన్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకం ద్వారా 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న అగ్రవర్ణ పేద మహిళలకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ క్రమంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత ఈబీసీ నేస్తం కింద జిల్లాలో 21,539 మంది లబ్ధిదారులకు రూ.32.31 కోట్లు మంజూరు చేసిందన్నారు. అనంతరం ప్రజాప్రతిధులు, లబ్ధిదారులతో కలిసి రూ.32.31 కోట్ల మెగా చెక్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ముందు కలెక్టర్‌కు ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్‌ల చైర్‌పర్సన్‌లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని, బీసీ సంక్షేమ అధికారి ఖుష్బూ కొఠారి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళలు సంపద సృష్టిస్తున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాల ద్వారా నాలాంటి మహిళలు చాలా మంది సంపద సృష్టిస్తున్నారు. ఈబీసీ నేస్తం వంటి నగదు బదిలీ కార్యక్రమం వల్ల ఉత్పత్తి రంగంలో మహిళల పాత్ర గణనీయంగా పెరిగింది. మహిళలు స్వయంగా నిర్వహిస్తూ మూతపడిన సూక్ష్మ పరిశ్రమలను ప్రభుత్వ సహకారంతో తిరిగి నిలబెట్టుకోగలుగుతున్నారు. సీఎంకు మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– జయకుమారి, శారదానగర్, అనంతపురం

ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు



మహిళల అభ్యున్నతి, స్వయం ఉపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి మాటల్లో చెప్పలేనిది. ఆయన అమలు చేస్తున్న పథకాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. అగ్రవర్ణ పేదలకు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ఈబీసీ నేస్తం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తూ అండగా నిలుస్తున్న సీఎంకు కృతజ్ఞతలు.

– ప్రసన్నలక్ష్మి, బుడ్డప్పనగర్, అనంతపురం

లోకేష్ పాదయాత్రకు స్పందన కరువు

తాడిపత్రి: నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు స్థానిక జన స్పందన కరువైంది. బుధవారం రెండో రోజు పెద్దపప్పూరు మండలంలోని పసలూరు నుంచి పాదయాత్ర ఇతర ప్రాంతాల నుంచి తరలించిన జనంతో సాదాసీదాగా సాగింది. కొట్టాలపల్లి క్రాస్ వద్ద మిర్చి రైతులతో సమావేశం, కమ్మవారిపల్లి వద్ద నిరుద్యోగ యువతతో లోకేష్ భేటీ అయ్యారు. యాడికి మండలం నగరూరు వద్ద రైతులతో ముఖాముఖి అనంతరం తూట్రాళ్లపల్లి వద్ద భోజన విరామం ఇచ్చారు. అంతకు ముందు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారితో ముఖాముఖిలో మాట్లాడారు. ఎస్సీ కాలనీలో సీనియర్ సిటిజన్లతో సమావేశమయ్యారు. అరటి రైతులు, ఎన్టీఆర్ గృహాల బాధిత లబ్ధిదారులు, కూర్మాజీపేట, రాయలచెరువు ఎస్సీ కాలనీ వాసులతో సమావేశం, అనంతరం బహిరంగ సభలో ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో కలసి ప్రసంగించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన స్క్రిప్టు ఆధారంగా ఆయా సామాజిక, కుల వృత్తుల వారిని ఎంపిక చేసి, వారితో ఉద్దేశ్యపూర్వకంగా వినతి పత్రాలు ఇప్పించి, పాదయాత్రలో వారికి భరోసా కల్పించినట్లు నాటకీయ పరిణామాలకు తెరలేపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఆరోపణలు చేశారు.

వెధవ స్క్రిప్టులు.. సిగ్గులేని మాలోకం

- లోకేష్‌పై తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫైర్
- టీడీపీని జేసీ సోదరులు దొంగల పార్టీగా మార్చారు
- వారి దోపిడీల్లో వాటా కోసం కక్కుర్తి పడ్డావా?


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: టీడీపీని జేసీ సోదరులు దొంగల పార్టీగా మార్చేశారని, జేసీ ప్రభాకరరెడ్డి మూలంగా భవిష్యత్తులో దోపిడీదారులకే సీట్లు ఇచ్చుకునే పరిస్థితి ఆ పార్టీకి దాపురించనుందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. వెధవలు రాసిచ్చిన స్క్రిప్టులు సిగ్గులేకుండా చదువుతున్నప్పుడు కాస్తైనా బుద్ధుండాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై మండిపడ్డారు. తాడిపత్రిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఏమన్నారో... ఆయన మాటల్లోనే.

- 'జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓ మూర్ఖుడు. టీడీపీ హయాంలో కేసులు పెడితే నీవు (జేసీపీఆర్), నీ కుమారుడు జైలు కెళ్లిన విషయాన్ని మరిచావా? నీకు బుద్ధి లేకపోతే నీ సోదరుడు జేసీ దివాకర్‌రెడ్డిని అడుగు చెబుతాడు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయి జైలుకెళ్లి వస్తే నాడు స్వాతంత్య్రం కోసం జైలు కెళ్లాం... నేడు ప్రభుత్వ వేధింపులతో వెళ్లామంటూ ఫొటోలతో ముద్రించిన కరపత్రాలను సిగ్గులేకుండా పంపిణీ చేస్తారా?
- బాబూ మాలోకం.. మీ నాన్న ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మీ సామాజిక వర్గానికి చెందిన ప్రభోదానంద ఆశ్రమంపై జేసీ సోదరులు దగ్గరుండి అత్యంత క్రూరంగా దాడులు చేయించారు. ఈ ఘటనలో నామమాత్రపు కేసులతో సరిపెట్టి జేసీ సోదరులను కాపాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అప్పటి దాడులకు సంబంధించిన సీసీ ఫుటేజీలను పరిశీలించి, పక్కా ఆధారాలతో కేసులు నమోదు చేశారు. టీడీపీలో ఎంపీగా ఉన్న జేసీ దివాకర్‌రెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తాళాలు వేసిన చరిత్ర కూడా మీ నాన్న హయాంలో జరిగింది. ఈ వాస్తవాలు తెలుసుకోకుండా ఎలా మాట్లాడుతావు? బీఎస్ 3 వాహనాలను తుక్కు కింద కొనుగోలు చేసి, అక్రమంగా బీఎస్ 4 వాహనాలుగా చూపి జేసీ సోదరులు వెనకేసిన రూ. కోట్లలో నీకేమైనా వాటా ఇస్తామన్నారా? తప్పు చేసిన జేసీ సోదరులపై కేసులు నమోదైతే అవి అక్రమమని ఎలా అంటావు?
- వెధవలు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివిన నిన్ను, పంపిణీ చేసిన కరపత్రాల వారిని చూసి ప్రజలు నవ్వుతున్నారు. వీడు తాడిపత్రి రక్షకుడా.. కానేకాదు తాడిపత్రి భక్షకుడని హేళన చేస్తున్నారు. తాడిపత్రిలో బలమైన సామాజిక వర్గం ఉందని, మా ప్రభుత్వం వస్తే ఏదో చేసేస్తానని పేర్కొంటున్న నీచేత ఏమీకాదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎలాంటి కీడు జరగకుండా కాపాడుకునే సత్తా నాలో ఉంది.
- జేసీ సోదరులు వారి స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తారు. వారు వెధవలన్న విషయాన్ని గుర్తించు. వెధవలను వెంటబెట్టుకుని తిరుగుతున్నావు. నీ పాదయాత్రకు చందాలు వసూలు చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దోపిడీ దారులు జేసీ సోదరులన్న విషయాన్ని గమనించు.
- గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభంలో పడింది టీడీపీ హయాంలోనే. అప్పట్లో ప్రైవేట్ చెక్‌పోస్టులు పెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఒకప్పుడు 700కు పైగా నల్లబండలు, 300 వరకు గ్రానైట్ పరిశ్రమలు ఉండేవి. టీడీపీ హయాంలో ఆ పరిశ్రమలు సగానికి పైగా తగ్గిపోయాయి.
- లారీ అసోసియేషన్ పేరుతో జమ చేసిన సొమ్మును జేసీపీఆర్ ఇంట్లోనే ఉంచుకున్నాడు. సాయిబాబా గుడి పేరుతో వసూలు చేసిన రూ.3 కోట్లను కూడా తనవద్దే దాచుకున్నాడు. ఏళ్లు గడుస్తున్నా గుడి నిర్మాణం పూర్తి కాలేదు. ఇన్ని దుర్మార్గాలు చేసిన జేసీ సోదరులు దేశనేతలేం కాదు. వీరి అక్రమాలపై రాయడం మొదలు పెడితే పెద్ద గ్రంథమే అవుతుంది.
- భోజన విరామ సమయంలో తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన వారు పక్కకు రావాలని పిలిచి ఉంటే పక్క ప్రాంతాల నుంచి వచ్చిన జనమెంతో నీకు తెలిసి ఉండేది. అప్పుడైనా ఈ జేసీ సోదరుల సమర్థత ఏమిటో నీకు అర్థమై ఉండేది. కనీసం ఆ పని కూడా చేయలేకపోయావు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇసుకల పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తూ విక్రయాలు సాగిస్తుంటే ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని అంటావా? టీడీపీ హయాంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకున్న దోపిడీదారులు జేసీ సోదరులు అనే విషయం తెలియదా? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేసేందుకు కనీసం బుద్ధి, జ్ఞానం ఉండాలి. వాళ్లేదో చెప్పారని నీవదే మాట్లాడితే చూస్తూ ఊరుకోబోం.

ఈ దుర్మార్గుల గురించి నీకు తెలియకపోతే మీ నాయన చంద్రబాబును అడుగు. అతడి వద్ద వీరి అక్రమాల జాబితా ఉంటుంది. అందులో జేసీ సోదరుల మూలంగా నాశనమైపోయిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరన్నది తెలుస్తుంది. ఇవన్నీ తెలుసుకుని ప్రసంగాలు చెయ్యి. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటావ్' అంటూ హెచ్చరించారు.

చిన్నారికి కుక్క కాటు


గాయపడిన సుంకేనాయక్

ఉరవకొండ: మండలంలోని లత్తవరం తండాలో చిన్నారిపై వీధి కుక్క దాడి చేసి కరిచింది. వివరాలు... లత్తవరం తండాకు చెందిన రమేష్, షాలిని దంపతులకు నాలుగేళ్ల వయసున్న కుమారుడు సుంకేనాయక్ ఉన్నాడు. బుధవారం ఉదయం ఇంటి ఎదుట ఆడుకుంటున్న సుంకే నాయక్ పై వీధి కుక్క దాడి చేసి ముఖంపై, పెదవులను, కాలి పిక్కలను కొరికింది. అదే సమయంలో చిన్నారి ఏడుపు విని బయటకు వచ్చిన తల్లి... కుక్క బారి నుంచి కుమారుడిని కాపాడి ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు.

సీఎం సభావేదిక స్థల పరిశీలన


సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల: ఈ నెల 17న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకను పురస్కరించుకుని నార్పలలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు అనువైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం పరిశీలించారు. జగనన్న వసతి దీవెన పథకం నిధులను ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ విడుదల చేయనున్నారు. దీంతో సభకు అనువైన స్థలం, ఏర్పాట్లపై స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ఎంపీపీ నాగేశ్వరావు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, నాయకులు మిద్దె కుళ్లాయప్ప, దాడితోట బాషా, బాలనాగి బాలకృష్ణ, మన్నీల శివయ్య, గోపాల్, నారాయణరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి అభిషేక్ బుధవారం రాత్రి దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. వివరాలను గురువారం ఉదయం ఆయన వెల్లడించారు. కంబదూరు మండలం నూతిమడుగుకు చెందిన అభిషేక్, చిత్తూరు జిల్లా పాకాలకు భరత్ స్నేహితులు. ఇద్దరూ బీటెక్ ఫైనలియర్ చదువుతున్నారు. ఇటీవల పండుగకు భరత్‌ను తన స్వగ్రామానికి అభిషేక్ పిలుచుకెళ్లాడు. అక్కడ పరిచయమైన మారుతీకి అభిషేక్ రూ.6 వేలు అప్పుగా ఇచ్చాడు. మంగళవారం రాత్రి డబ్బులు ఇవ్వాలని మారుతిని అభిషేక్ కోరాడు. అయితే మారుతి స్పందించలేదు. దీంతో మారుతి స్నేహితుడు లోకేష్‌కి కాల్ చేసి ఆ పక్కనే ఉన్న మారుతికి ఫోన్ ఇవ్వాలని కోరాడు. మారుతి, లోకేష్‌తో మాట్లాడుతూ.. భరత్ నేను మీ ఊరికి వచ్చాను కదా అంటూ గుర్తు చేశాడు. ఆ సమయంలో స్నేహితుడికి చెల్లించాల్సిన డబ్బు విషయంగా నిలదీయడంతో మారుతి ఘర్షణ పడ్డాడు. దీంతో పౌరుషంతో భరత్‌ను కొట్టేందుకు మారుతి.. లోకేష్ మరో ముగ్గురితో కలసి ఆటోలో బుధవారం రాత్రి ఎస్కేయూ క్యాంప్‌కు చేరుకున్నాడు. వారి రాకను గమనించిన భరత్ వెంటనే హాస్టల్ గదిలో దాక్కున్నాడు. ఆ సమయంలో ఎదురుపడ్డ అభిషేక్‌పై దాడి చేసి, బాధితుడిపై ద్విచక్రవాహనంపైనే అతన్ని ఎక్కించుకుని మారుతీ వెళ్లిపోయాడు. ఆ సమయంలో అభిషేక్ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కిడ్నాప్ చేశారని పోలీసులకు ఎస్కేయూ అధికారులు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేసి, పక్కా ఆధారాలతో ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

1,100 రైల్వే ఉద్యోగాల భర్తీకి చర్యలు


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే అధికారులు

గుంతకల్లు: రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు డివిజన్ పరిధిలో ఎంపికైన దాదాపు 1,100 మందికి గురువారం ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్ తెలిపారు. డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2021, అక్టోబర్ 2న ప్రారంభించిన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా రైల్వేలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 71వేల ఉద్యోగాలను భర్తీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే గుంతకల్లు డివిజన్ పరిధిలో 1,100 రైల్వే ఉద్యోగాలతోపాటు పోస్టల్ విభాగంలో 13 మందికి, హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగంలో 23 మందికి నియామకపు ఉత్తర్వులు సిద్ధమైనట్లు వివరించారు. వీటిని గుంతకల్లులోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో గురువారం ఉదయం రైల్వే సహాయ మంత్రి రావుసాహెబ్ పాటిల్ ధన్వే చేతుల మీదుగా అర్హులకు అందజేయనున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఖరీదైన వాహనాలు నడపాలన్న కోరికతో వాటిని అపహరించుకెళ్లిన ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు వెల్లడించారు. గుత్తిలోని బండగేరికి చెందిన రాసేల నవీన్‌కు తండ్రి లేడు. తల్లితో కలసి మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కేటీఎం డ్యూక్, రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంటి ఖరీదైన ద్విచక్ర వాహనాలు నడపాలనే కోరిక బలంగా ఉండేది. అయితే వాటిని కొనుగోలు చేసేందుకు ఆర్థిక స్థోమత సరిపోక చోరీ చేయాలని భావించాడు. ఈ నెల 9న అనంతపురంలోని మూడో రోడ్డులో ఓ బుల్లెట్ బండి, 1వ రోడ్డులో మరొకటి అపహరించుకెళ్లాడు. అందులో ఓ వాహనాన్ని బుధవారం తీసుకుని 44వ జాతీయ రహదారిపై మామిళ్లపల్లి వరకూ వెళ్లాడు. వాహనంలో పెట్రోలు అయిపోవడంతో రోడ్డు పక్కనే పార్క్ చేసి విక్రయించేందుకు ప్రయత్నాలు చేపట్టాడు. ఈ క్రమంలో నగరంలో కొనుగోలుదారులు ఎవరైనా ఉన్నారంటూ ఆరా తీస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం దాచి ఉంచిన రెండో వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఆర్థిక భద్రతే లక్ష్యం

అనంతపురం సిటీ: మహిళల ఆర్థిక భద్రత కల్పించడమే తమ శాఖ లక్ష్యమని తపాలా శాఖ ఏపీ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్(టెక్నాలజీ, పీఎల్ఐ) ఎం.హరిప్రసాద్ శర్మ తెలిపారు. డివిజనల్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో విలేకర్లతో మాట్లాడారు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం కింద కనీసం రూ.1000 మొదలుకొని గరిష్టంగా రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చన్నారు. ఏడాదికి 7.5 శాతం వడ్డీ అందిస్తామన్నారు. డిపాజిట్ వ్యవధి రెండేళ్లు కాగా, ఏడాది తరువాత నిల్వ మొత్తంలో 40 శాతం ఉపసంహరించుకోవచ్చున్నారు. ఈ నెల 14న జరిగే తపాలా ఉద్యోగుల క్రీడా పోటీల మెమెంటోలను ఆవిష్కరించారు.

వివాహితను కాపాడిన బీకేఎస్ పోలీసులు


బాధితురాలిని ఓదారుస్తున్న కానిస్టేబుల్

బుక్కరాయసముద్రం: కుటుంబ కలహాల నేపథ్యంలో చెరువులో దూకిన వివాహితను సకాలంలో బీకేఎస్ పోలీసులు కాపాడారు. వివరాలు... అనంతపురంలోని పాతూరు పోస్టాఫీసు సమీపంలో నివాసముంటున్న శిరీష, పవన్‌కళ్యాణ్ దంపతులు. కొంత కాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగి ఘర్షణ పడుతుండేవారు. బుధవారం ఉదయం పవన్‌కళ్యాణ్‌తో గొడవపడిన శిరీష.. క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకునేందుకు బుక్కరాయసముద్రం పరిధిలోని ముసలమ్మ కట్ట వద్ద చెరువు కట్టపైకి చేరుకుంది. ఆమె పరిస్థితిని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తం చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వారిని చూడగానే ఒక్కసారిగా ఆమె చెరువులోకి దూకేసింది. వెంటనే పోలీసులు వివాహితను ఒడ్డుకు చేర్చి, పోలీస్ స్టేషన్‌కు పిలుచుకెళ్లి ఆత్మహత్యాయత్నానికి కారణాలు ఆరా తీశారు. కుటుంబసభ్యులను పిలిపించుకుని కౌన్సెలింగ్ ఇచ్చి వివాహితను అప్పగించనున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

ఉరవకొండ: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం తగ్గుపర్తి నివాసి కురుబ హనమంతప్ప(58) ఈ నెల 18న జరిగే ఊరి దేవరకు బంధువులను ఆహ్వానించేందుకు మంగళవారం ఉరవకొండ మండలం వై.రాంపురం గ్రామానికి వచ్చాడు. అనంతరం స్వగ్రామానికి వెళుతూ రెడ్డప్ప తోటలో బావి వద్ద కూర్చొని మద్యం సేవిస్తూ అదుపు తప్పి అందులో పడ్డాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు బావిలో తేలిన వృద్ధుడి మృతదేహాన్ని చూసి, సమాచారం అందించడంతో బంధువులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ హరినాథ్ తెలిపారు.

ఆసక్తిగా గాడిదల పరుగు పందెం


పోటీలో దూసుకెళుతున్న గాడిదలు

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఏపీ మండల రజకసంఘం ఆధ్వర్యంలో గాడిదల పరుగు పందెం ఆసక్తిగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి ఆరు గాడిదలను పోషకులు పట్టుకువచ్చారు. పోటీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో వజ్రకరూరు జనసంద్రమైంది. రాయదుర్గం నియోజకవర్గం రంగసముద్రం నివాసి మల్లేష్‌కు చెందిన గాడిద ప్రథమ స్థానం, కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా ఆకులరాంపురం నివాసి మడివాలప్పకు చెందని గాడిద ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు సురేంద్ర, నాయకులు గురుమూర్తి, సురేష్, సునీల్, ధనుంజయ, గుండాల సుధ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను గాయపరిచి ఆత్మహత్యాయత్నం చేసిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం చూసి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు, జీవితంపై విరక్తితో ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డారు.


మృతుడు గణేష్

గార్లదిన్నె: రైలు కిందపడి ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన సతీష్ కుమారుడు గణేష్(16) అనంతపురంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం గార్లదిన్నెకు వచ్చిన గణేష్.. నేరుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల మేరకు గణేష్‌గా గుర్తించి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కళ్యాణదుర్గం: కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్తను చూడలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని శంకరప్ప తోటలో నివాసముంటున్న బోయ నరసప్ప, మమత (37) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 3న భార్యతో గొడవ పడిన భర్త క్షణికావేశంలో ఆమెను కొట్టి గాయపరిచాడు. అనంతరం మనస్తాపంతో ఇంటి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై శరీరం తీవ్రంగా కాలిపోయింది. అప్పటి నుంచి అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. భర్త పరిస్థితిని చూసి చలించిపోయిన మమత తీవ్ర మానసిక వేదనతో బుధవారం ఉదయం తన సోదరుడి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కాపాడి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు కళ్యాణదుర్గం పోలీసులు తెలిపారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన హనుమయ్య (32) తన తోటలోని చింతచెట్టుకు లుంగీతో ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు ... బుధవారం తెల్లవారుజాము 3.30 గంటలకు తోటకు వెళ్లిన హనుమయ్య ఉదయం 8 గంటలైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు తోట వద్దకెళ్లి పరిశీలించారు. అప్పటికే చింతచెట్టుకు వేసుకున్న ఉరికి వేలాడుతున్న హనుమయ్య మృతదేహాన్ని గమనించి, బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కడుపు నొప్పితో బాధపడుతున్న తన భర్తకు చికిత్స చేయిస్తున్నామని, అయితే వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఆత్మహత్య చేసుకున్నాడంటూ భార్య హనుమక్క తెలిపిన మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

దేవుడితో రాజకీయాలా?

- చింతకుంట కాలభైరవస్వామి అర్చకులు


విలేకర్లతో మాట్లాడుతున్న అర్చకులు

పుట్లూరు: మండలంలో ప్రసిద్ధి చెందిన చింతకుంట కాలభైరవస్వామి ఆలయాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం బాధాకరమని ఆలయ అర్చకులు చంద్రమౌళి, రామసుబ్బయ్య, శివనాగేంద్రమూర్తి, శివసాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 8న గార్లదిన్నెలో జరిగిన యువగళం పాదయాత్ర బహిరంగ సభలో నారా లోకేష్ మాట్లాడుతూ.. చింతకుంట కాలభైరవ స్వామి ఆలయ నిర్మాణానికి అధికార పార్టీ నాయకులు రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లుగా చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. బుధవారం కాలభైరవస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయ జీర్ణోద్ధరణకు కమిటీని ఏర్పాటు చేసి చందాలు సేకరించారని గుర్తు చేశారు. అయితే కమిటీలో తరతరాలుగా అర్చకత్వం నిర్వహిస్తున్న వారిలో ఏ ఒక్కరికీ చోటు కల్పించలేదని గుర్తు చేశారు. వసూలు చేసిన మొత్తం డబ్బు ఖర్చు అయినట్లు కమిటీలోని కొందరు సభ్యులు చూపారన్నారు. ఇందుకు సంబంధించి పెళ్లిళ్లకు వెళ్లి వచ్చిన ఖర్చులు, వ్యక్తిగత ప్రయాణ ఖర్చులతో పాటు ఇతర అనవసర ఖర్చులను లెక్కల్లో చూపారన్నారు. ఈ విషయంగా నిలదీయడంతో తమను వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఆలయాన్ని జీర్ణోద్ధరణగావించిన అనంతరం గుడిలోకి కాలు కూడా పెట్టనివ్వబోమంటూ బెదిరిస్తున్నారన్నారు. ఈ అక్రమాలపై దేవదాయ శాఖకు ఫిర్యాదులు అందడంతో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం కాలేదన్నారు. అయితే ఈ విషయాన్ని ఎలాంటి సంబంధంలేని రాజకీయాలతో ముడిపెట్టి ఆరోపణలు చేయించడం సబబు కాదన్నారు. రూ.10 లక్షలు ఎవరు.. ఎవరిని అడిగారని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. దయచేసి కాలభైరవస్వామి ఆలయంపై రాజకీయ ఆరోపణలు చేయించరాదని హితవు పలికారు.

భానుడు భగభగ.. ఉందాం చల్లగా..

భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ప్రతాపం చూపుతుండడంతో జనం అల్లాడిపోతున్నారు. నగరంలో రోడ్లన్నీ 11 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండవేడిమి నుంచి జనం వివిధ రకాలుగా ఉపశమనం పొందుతున్నారు. మధ్యాహ్నానికి ఇంటికి వస్తున్న పిల్లలు గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు. నీటి కుంటలు, చెరువులు ఈతకు వచ్చే వారితో సందడిగా మారుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఉదయం 11 గంటల సమయంలో నిర్మానుష్యంగా కనిపిస్తున్న జాతీయ రహదారి



కెనాల్ వద్ద పిల్లల జలకాలాట



మూడోరోడ్డులో ఇంటి వద్ద క్యారం ఆడుతూ కాలక్షేపం..



తాటిముంజలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు..

క్లుప్తంగా

జగనన్న పాలనకే ప్రజల మద్దతు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతు తెలుపుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల వ్యాప్తంగా గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలను అడగగా ప్రతి ఒక్కరూ సానుకూలంగా స్పందించారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

అనంతపురం సెంట్రల్: నూతన కలెక్టర్ గౌతమిని కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో బుధవారం ఉదయం ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మార్చ్‌ఫాస్ట్‌లో తృతీయస్థానం



పోటీల్లో పాల్గొన్న మెడికోలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న అనంత మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ప్రారంభం సందర్భంగా నిర్వహించిన మార్చ్ ఫాస్ట్‌లో తృతీయస్థానంలో నిలిచారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ బాబ్జీ చేతుల మీదుగా మొమెంటో అందుకున్నారు.

బీమా సొమ్ము అందజేత

ఆత్మకూరు: పాపంపల్లికి చెందిన బోయ యల్లప్పకు బుధవారం స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ సందీప్‌యాదవ్ రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఇటీవల పాపంపల్లికి చెందిన బోయ నాగవర్ధన్ గుండెపోటుతో మరణించాడు. అతను బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రూ.330 ప్రీమియం చెల్లించాడు. నాగవర్ధన్ తండ్రి యల్లప్పకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

అడిగిన వెంటనే ఉపాధి పనులు



తలుపూరు వద్ద ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అనురాధ

ఆత్మకూరు: అడిగిన వెంటనే ఉపాధి పనులు కల్పిస్తున్నారంటూ ఉపాధి హామీ కూలీలు సమాధానం ఇచ్చారు. బుధవారం తలుపూరు వద్ద ఏపీడీ అనురాధ, ఏపీఓ సుజాత ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని జాగ్రత్తలు పాటించాలని కూలీలకు సూచించారు.

పేదలకు ఇంటి పట్టాలివ్వాలి

రాప్తాడురూరల్: శ్రీశ్రీ నగర్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు, స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఒకటో నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సీపీఎం ఒకటో నగర కమిటీ కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రాజాకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా నాయకులు వెంకటనారాయణ, ముస్కీన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని కోచింగ్ సెంటర్లపై చర్యలకు డిమాండ్

రాప్తాడురూరల్: అనంతపురం నగరంలో ఎంసెట్, నీట్ కోచింగ్ పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పరమేష్ మాట్లాడుతూ ఎంసెట్, నీట్ పేరుతో కోచింగ్ సెంటర్లను ప్రారంభించి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ కోచింగ్ సెంటర్లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, వినోద్, చంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఏం చేశావు బాబూ?

అనంతపురం క్రైం: మైనార్టీలకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏం చేశారో చెప్పాలని మేయర్ వసీం ప్రశ్నించారు. బుధవారం నగరంలోని 39వ డివిజన్‌లో నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ 3 ఏళ్ల 10 నెలల కాలంలో నగరంలో జరుగుతున్న రూ.800 కోట్ల అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మైనార్టీలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేబినెట్‌లో అవకాశం కల్పించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారన్నారు. టీడీపీ కుట్రలను ఎవరూ నమ్మరని, రానున్న ఎన్నికల్లో మైనార్టీలందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్ కుమార్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, ఏ1రఫి, హిదయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ ఇంటికి అతికించుకుంటున్న వృద్ధురాలు, చిత్రంలో మేయర్

మైనార్టీలపై చంద్రబాబు కపట ప్రేమ

అనంతపురం క్రైం: ఓటు బ్యాంకు రాజకీయాల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ మరోసారి మైనార్టీ పట్ల కపట ప్రేమ చూపుతున్నారని వైఎస్సార్ సీపీ అనుబంధ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ విమర్శించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. దివంగత నేత వైఎస్సార్ మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి, ఉన్నత చదువులు అభ్యసించడానికి కృషి చేశారని, తద్వారా ఎంతో మంది మైనార్టీలు ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కేబినెట్‌లో కీలక పదవులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నగరంలో మైనార్టీలకు మేయర్, 9 మందికి కార్పొరేటర్లు, ఒక కో ఆప్షన్, మార్కెట్ యార్డు చైర్మన్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు, మైనార్టీ ఫైనాన్స్ రాష్ట్ర డైరెక్టర్ పదవులను అందించి మైనార్టీలకు అగ్రతాంబూలాన్ని అందించారని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీలు ఒక్కరికి కూడా కేబినెట్‌లో అవకాశం కల్పించకుండా మైనార్టీ శాఖా మంత్రి పదవిని పల్లె రఘునాథ రెడ్డికి కేటాయించినప్పుడు మైనార్టీలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న రావెల కిషోర్ బాబు నిర్వాకంతో అప్పటి గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ జామిమూన్ కన్నీటిపర్యంతమైన ఉదంతాన్ని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాదాఖలందర్, అంజాద్‌ఖాన్, దాదాపీర్, ఖాదర్‌బాష, ఎస్ ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైపుల్లాబేగ్

ప్రభుత్వ లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గుత్తి పోలీసు స్టేషన్‌లో పని చేసే ఏఎస్ఐ లూకయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక జేఎన్‌టీయూ క్రైస్తవ శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కాగా కడప జిల్లాకు చెందిన లూకయ్య 1990 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. అనంతపురం ట్రాఫిక్, కసాపురం, పుట్లూరు, తాడిపత్రి, యాడికి, గుత్తి పోలీసు స్టేషన్లలో పని చేశారు. ఈయనకు భార్య కనకమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియల్లో గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్ప, గుత్తి సి.ఐ వెంకట్రామిరెడ్డి, ఎస్సై ఆర్ శ్రీనివాసులు, జిల్లా పోలీసు అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్ పాల్, హరినాథ్, గుత్తి పోలీసు స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

అంకితభావంతో పనిచేయండి

- జెడ్పీ ఉద్యోగులకు డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఆదేశం

అనంతపురం సిటీ: అప్పగించిన పనిని అంకితభావంతో పూర్తి చేయాలని జెడ్పీ ఉద్యోగులను డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఆదేశించారు. డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన కార్యాలయంలోని అన్ని సెక్షన్ల ఉద్యోగులతో బుధవారం సమావేశమై సెక్షన్ల వారీగా అన్ని అంశాలను సమీక్షించారు. ఏ ఒక్క ఫైలు పెండింగ్‌లో ఉంచడానికి వీల్లేదన్నారు. పరస్పర సహకారంతో సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన అవసరమన్నారు. పని వేళల్లో అనవసర తిరుగుళ్లు మానుకోవాలని హితవు పలికారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సీఈఓ, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. సమావేశంలో పరిపాలనాధికారులు అశ్వత్థప్ప, హనుమంతరెడ్డి, రవిప్రసాద్, నాగేంద్ర, కృష్ణమోహన్, తిప్పయ్య, శ్రీనివాసులు, ధనుంజయ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవులో ఏసీపీ

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) శ్రీనివాసులు రెడ్డి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఆయన తిరిగి విధుల్లోకి చేరే పరిస్థితులు కన్పించడం లేదు. సెలవు అయిన తర్వాత మరో ప్రాంతానికి బదిలీ చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా నగరంలోని పరిస్థితుల దృష్ట్యా డెప్యుటేషన్‌పై ఓ ఏసీపీని ఇవ్వాలని కమిషనర్ రమణారెడ్డి డీటీసీపీకి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. మరి కొన్ని రోజుల్లో డెప్యుటేషన్‌పై మరో ఏసీపీ నగరపాలక సంస్థకు రానున్నట్లు తెలిసింది.

మేయర్ ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని కోవూర్‌నగర్‌లో ఉన్న నిమ్రా మసీదులో బుధవారం రాత్రి నగర మేయర్ మొహమ్మద్ వసీం సలీం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను మసీదు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని అల్లాహ్ ముస్లింలకు బహుమతిగా అందించారన్నారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్, కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, అనిల్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కువైట్ ఖాదర్‌బాషా, ఖాజా, మేరాజ్, షెక్షావలి, గఫార్, దాదు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంచి పుస్తకం జీవితానికి దిక్సూచి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణా రెడ్డి

అనంతపురం: మంచి పుస్తకం జీవితానికి దిక్సూచి వంటిదని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. ఎస్కేయూలో బుధవారం రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ మునినారాయణప్ప, అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ రామలింగయ్య సంయుక్తంగా రచించిన 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ సెల్ఫ్–హెల్ప్ గ్రూప్స్' అనే పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి మహిళ స్థితిగతులపై మంచి పుస్తకం రచించారని ప్రశంసించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, పరీక్షల విభాగం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిరోజ్ బాబు, డాక్టర్ చాగంటి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీఎం జగన్‌కు కృతజ్ఞతలు'

అనంతపురం క్రైం: కులగణనపై కార్యాచరణ కమిటీ నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెల్పుతున్నట్లు వైఎస్సార్ సీపీ అనుబంధ బీసీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 139 బీసీ కులాలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పూర్తి స్థాయి న్యాయం జరిగేందుకు ఏపీలో బీసీల గణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయడం శుభపరిణామమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందుకు ససేమిరా అనడం సరికాదన్నారు. కుల గణనతో మరిన్ని పథకాలు సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీల బాధను అర్థం చేసుకుని ముఖ్యమంత్రి కులగణనకు శ్రీకారం చుట్టారని, అందుకు ఆయనకు బీసీలందరూ రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

14న రమణ మహర్షి ఆరాధన మహోత్సవం

అనంతపురం కల్చరల్: భగవాన్ రమణ మహర్షి 73వ ఆరాధన మహోత్సవం ఈనెల 14న స్థానిక మూడవ రోడ్డులోని గొంగడి రామప్ప ఫంక్షన్ హాలులో ఉదయం 9.45 గంటలకు నిర్వహిస్తున్నట్లు రమణ మహర్షి సేవా సమితి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని ,అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

వీధి బాలలకు రక్షణ కల్పిద్దాం

అనంతపురం కల్చరల్: వీధి బాలలను ఆదుకుని రక్షణ కల్పిస్తే దేశానికి ఉపయోగకరంగా ఉంటారని సీఆర్‌డీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సద్దాంబాషా అన్నారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని స్థానిక లక్ష్మీనగర్‌లోని క్రిసెంట్ రైన్‌బో హోమ్‌లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆశ్రమంలోని వీధి బాలలు ఫ్లెక్సీలు, ప్లకార్డ్స్ పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వీధి బాలలకు జీవించే హక్కు రాజ్యాంగం కల్పించినా సమాజంలో చాలా మంది స్వార్థంతో చూస్తున్నారన్న విషయాన్ని ఆలోచనాత్మకంగా చాటి చెప్పారు. సద్దాంబాషా మాట్లాడుతూ అనేక కారణాల వల్ల వీధిబాలలు దైన్యమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారన్నారు. 5 నుంచి 17 ఏళ్ల లోపు చిన్నారులు పార్కుల్లో, వీధుల్లో చెత్తనేరుకుంటూ బతుకు పయనం సాగిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. వారికి ఆదరణ కల్పించే సెంటర్లు మరిన్ని పెరగాలన్నారు. కార్యక్రమంలో శిల్ప, మమత,రూపారాణి తదితరులు వీధిబాలల గురించి మాట్లాడారు.

వీసీకి వినతిపత్రం అందజేత

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధనను స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రీజినల్ ఇన్‌చార్జ్ సి.కృష్ణ బుధవారం కలిశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనే విద్యార్థులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటాయని పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం అమలు చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న కృష్ణ

ఉద్యోగం పేరిట కుచ్చుటోపీ

అనంతపురం సిటీ: అనంతపురంలోని తపాలా శాఖ డివిజనల్ కార్యాలయంలో పని చేసే ఓ పోస్ట్‌మెన్ .. ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ నిరుపేద నుంచి రూ.50 వేలు వసూలు చేశాడు. బుక్కరాయసముద్రం మండలం జంతలూరుకు చెందిన బాధితుడు ఎన్.నాగభూషణం కథనం మేరకు.. పండ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే తనకు వ్యాపారం పెద్ద లాభసాటి కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. తపాలా శాఖ డివిజనల్ కార్యాలయంలో పని చేసే ఓ పోస్ట్‌మెన్ తనను కలసి నైట్ వాచ్‌మెన్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపాడు. రూ.50 వేలు అవుతుందనే సరికి అప్పు చేసి కొంత, భార్య పుస్తెలు అమ్మి మరికొంత డబ్బు సమకూర్చుకొని పోస్ట్‌మెన్‌కు ఇచ్చాడు. ఇది జరిగి సంవత్సరం పూర్తయింది. అడిగితే రేపు మాపు అంటూ సమాధానాలు చెప్తూ వచ్చాడు. చేసేది లేక తపాలా శాఖ అధికారులకు రెండ్రోజుల కిందట ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నాగభూషణం తెలిపాడు.కేసు పెట్టొద్దని, రెండు నెలల సమయం ఇస్తే రూ.50 వేలు వెనక్కి ఇచ్చేస్తానంటూ కాళ్ల బేరానికి వచ్చినట్లు బాధితుడు తెలిపారు. తపాలా శాఖలోని ఓ సీనియర్ అధికారి సదరు పోస్ట్‌మెన్‌ను పిలిపించి విచారించగా.. రెండు నెలల్లో డబ్బు వెనక్కి ఇచ్చేస్తానని హామీ ఇవ్వడంతో అతనిపై పోలీసులకు గానీ, ఉన్నతాధికారులకు గానీ ఫిర్యాదు చేయకుండా కొందరు సర్దిచెప్పి తనను పంపించేశారని బాధితుడు తెలిపాడు.

చెస్ టోర్నీ నిర్వహణ అభినందనీయం : కలెక్టర్

అనంతపురం అర్బన్: జాతీయ స్థాయి చెస్ టోర్నీని అనంతపురం వేదికగా నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్, అఖిల భారత చదరంగం సమాఖ్య, ప్రపంచ చదరంగం సమాఖ్య సౌజన్యంతో ఆల్ అనంతపురం చెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మే, 11 నుంచి 15వ తేదీ వరకూ ఏఐసీఎఫ్ చెస్ ఫర్ ఎవరివన్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్–2023 నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించి, నిర్వాహకులను అభినందించారు. టోర్నీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. అనంతపురంలోని రెయిన్‌బో మాంటిస్సోరీ ప్రీ స్కూల్ వేదికగా టోర్నీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 95812 50684లో సంప్రదించాలని కోరారు.

చంద్రబాబుకు ఓటేస్తే కరువే

రాప్తాడు: చంద్రబాబుకు ఓటేస్తే గతంలో మాదిరిగా మళ్లీ కరువొస్తుందని ప్రసన్నాయపల్లి సచివాలయ కన్వీనర్లు ఉషారాణి, భాగ్యలక్ష్మి బోయ మనోహర్ అన్నారు. ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని వివరించి, ఇంటి యాజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు. వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గృహసారథులు మనోహర్, అంకాలమ్మ, సృజన, విద్య, షానుర్ బేగం, బోయ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతా నుంచి రూ. 20 వేలు మాయం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆధార్ లింకేజీ ఆధారంగా ఓ మహిళ ఖాతాలోని రూ.20 వేలను సైబర్ నేరగాళ్లు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని జేఎన్‌టీయూ సమీపంలో ఉన్న లక్ష్మి ఆర్కేడీ అపార్టుమెంటులో నివాసముంటున్న సుమంగళికి సాయినగర్‌లోని ఎస్‌బీఐ ప్రధాన శాఖలో ఖాతా ఉంది. బుధవారం ఉదయం నగదు కోసం బ్యాంక్‌కు వెళ్లిన ఆమె... తన ఖాతాలో రూ.20 వేలు మాయమైనట్లు గుర్తించి, ఆరా తీసింది. పరిశీలించిన బ్యాంక్ అధికారులు మంగళవారం సాయంత్రం రూ.10వేలు, బుధవారం ఉదయం రూ.10వేలను ఆధార్ నంబర్ ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తులు కాజేసినట్లు వివరించారు. ఇటీవల ఎక్కడైన ఫింగర్ ప్రింట్‌లు వేశారా? అని బ్యాంక్ అధికారులు అడగడంతో 2021, మార్చిలో ఓ సైటు కొనుగోలు సమయంలో రిజిస్టర్ కార్యాలయంలో వేలి ముద్రవేసినట్లు ఆమె తెలిపింది. దీంతో బ్యాంక్ అధికారుల సూచన మేరకు 1930కు, వన్‌టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ రవిశంకర రెడ్డి తెలిపారు.



న్యూ రెవెన్యూ కాలనీలో యువకునితో మాట్లాడుతున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్



4వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం



32వ డివిజన్‌లో పథకాల లబ్ధిని తెలియజేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

ఇంటింటా ఆదరణ

గృహసారథులు, వలంటీర్లతో కలిసి ప్రజా ప్రతినిధులు నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ఇంటింటా వివరిస్తూ నాయకులు బుధవారం ముందుకు సాగారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలు జగనన్న చేస్తున్న మేలుకు సలాం అంటున్నారని వారు తెలిపారు.

– అనంతపురం క్రైం:



5వ డివిజన్‌లో పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి

సీజ్ చేసిన ప్లాస్టిక్ పీసీబీకి అప్పగింత

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అధికారులు సీజ్ చేసిన పది టన్నుల ప్లాస్టిక్‌ను బుధవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులకు అప్పగించారు. ప్లాస్టిక్‌ను అల్ట్రాటెక్ కంపెనీలోకి తీసుకెళ్లి బూడిద చేయనున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

పన్ను రూ.83.50 లక్షల వసూలు

ఇంటి, నీటి పన్ను బుధవారం రూ.83.50 లక్షలు వసూలైంది. ఇంటి పన్ను రూ.75 లక్షలు, నీటి పన్ను రూ.8,50,000 వసూలైనట్లు కమిషనర్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలంటూ ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దివాకర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజల శ్రేయస్సు ఎంత ముఖ్యమో ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులు, పెన్షనర్ల శ్రేయస్సు, వారి సమస్యలను పరిరిష్కరించడమూ అంతే ముఖ్యమన్నారు. ఈ విషయంలో జాప్యం చేస్తుండడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.